
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.
6-11-2025 (Thursday) MAIN EDITION

## ఐపీవోకు ఎడ్‌టెక్ కంపెనీ..





**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రముఖ ఎడ్‌టెక్ కంపెనీ అయిన ఫిజిక్స్ వాలా ఐపీవోకు వస్తోంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 3,480 కోట్లు సమీకరించాలన్నది లక్ష్యం. వచ్చేవారంలో సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఇందులో ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ. 3,100 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ. 380 కోట్లు సమీకరించనుంది. సబ్‌స్క్రిప్షన్ ఈనెల 11న ప్రారంభమై 13న ముగుస్తుంది. షేర్ల అలాట్‌మెంట్ స్టేటస్ 14న రాత్రి వెల్లడవుతుంది. కంపెనీ షేర్లు 18న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టవుతాయి.

## బీహార్‌లో కొనసాగుతున్న పోలింగ్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు కొనసాగుతున్నాయి. తొలి దశ పోలింగ్ గురువారం ఉదయం 8 గంటలకు మొదలైంది. కాగా ఉదయం 7 గంటల నుంచే భారీగా ఓటర్లు పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల వరకు 53.77 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ఐదు గంటలకు ముగియనుంది. కాగా.. ఆ రాష్ట్రంలో 121 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి.

## యూఎస్‌లో భారత ఇన్‌ఫ్లూయెన్సర్ మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత్‌కు చెందిన ప్రముఖ ట్రావెల్ ఇన్‌ఫ్లూయెన్సర్, ఫొటోగ్రాఫర్ అనునయ్ సూద్ (32) మృతి చెందాడు. ఈ విషయాన్ని ఆయన కుటుంబసభ్యులు ఇన్‌స్టా పోస్ట్‌లో గురువారం వెల్లడించారు. దీంతో ఆయన అభిమానులు, ఫాలోవర్లు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అనునయ్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఢిల్లీ పర్యటనలో ఏపీ విద్యార్థులు




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌లో భాగంగా ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 52 మంది విద్యార్థులు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ కార్యక్రమం కోసం జిల్లాకు ఇద్దరు చొప్పున 52 మంది విద్యార్థులను అధికారులు ఎంపిక చేశారు. సమగ్ర శిక్ష అభియాన్, ఏపీ సైన్స్ సిటీ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులు ఢిల్లీ వెళ్లారు.

## 'బండి' మీటింగ్‌కు అనుమతి రద్దు



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమీపిస్తుండడంతో ప్రధాన పార్టీలు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర బండి సంజయ్‌తో గురువారం బోరబండలో సమావేశం నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. కాగా.. ఈ మీటింగ్‌కు పోలీసులు మొదట అనుమతి ఇచ్చారు. అయితే తాజాగా వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

## డ్రగ్స్ ఓవర్ డోస్‌తో యువకుడి మృతి



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ కల్చర్ పెరిగిపోతోంది. యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తాజాగా నగరంలో డ్రగ్స్ ఓవర్ డోస్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. నగరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన అహ్మద్ అలీ మొబైల్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. స్థానికంగా ఓ అపార్ట్‌మెంట్‌లో అలీ మరో ముగ్గురితో కలిసి డ్రగ్స్ పార్టీ చేసుకున్నాడు. ఇందులో ఇద్దరు యువతులు ఉన్నారు. అయితే డ్రగ్స్ ఓవర్ డోస్ కావడంతో అలీకి తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో అతడి స్నేహితులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి చూసే సరికి డ్రగ్స్ తీసుకున్నట్లు తెలియడంతో పోలీసులకు ఫోన్ చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

## అమ్మకానికి ఆర్సీబీ..

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ఫ్యాన్ ఫాలోయింగ్ కలిగిన జట్లలో ఒకటైన ఆర్సీబీ ఇప్పుడు కొత్త అడుగులేస్తోంది. ప్రపంచ ప్రఖ్యాత సంస్థ డయాజియో తమకు చెందిన ఆర్సీబీ ఫ్రాంచైజీని అధికారికంగా అమ్మకానికి పెట్టింది. ఇప్పటికే ఈ విక్రయ ప్రక్రియ ప్రారంభమైందని సంస్థ ధ్రువీకరించింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు పంపిన లేఖలో డయాజియో ఈ విషయాన్ని ప్రకటించింది. తమ భారతీయ అనుబంధ సంస్థ యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పెట్టుబడిపై "వ్యూహాత్మక సమీక్ష" ప్రారంభించామని తెలిపింది. ఈ సమీక్ష ప్రక్రియ 2026 మార్చి 31 నాటికి పూర్తవుతుందని కంపెనీ అంచనా వేస్తోంది.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని మూడు ప్రధాన పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ప్రధానంగా అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ మధ్య పోటీ ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఎన్నికలపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో బెట్టింగ్ రాయుళ్లు సైతం ఉప ఎన్నికలపై ఫోకస్ చేశారు. ఏ పార్టీ గెలుస్తుంది, ఎంత మెజారిటీ వస్తుందన్న అంశాలపై పందెం కాస్తున్నారు. ఇప్పటికే రూ.వందల కోట్లు బెట్టింగ్ జరిగినట్లు సమాచారం.** -అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# జూబ్లీహిల్స్ పోరు..
# బెట్టింగ్ జోరు!

**ఎవరు గెలుస్తారనే దానిపై పందెం**

**చేతులు మారుతున్న రూ.వందల కోట్లు**

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బెట్టింగ్ రాయుళ్ల ఆసక్తి**

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి గెలిచిన మాగంటి గోపినాథ్ మృతి చెందడంతో ఉప ఎన్నిక నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ స్థానం నుంచి బీఆర్ఎస్ ఆయన సతీమణి సునీతను బరిలో నిలిపింది. ప్రభుత్వ వ్యతిరేకత, సానుభూతితో గట్టెక్కాలని ఆ పార్టీ యోచిస్తోంది. మరోవైపు కాంగ్రెస్ బీసీ సామాజిక వర్గానికి చెందిన నవీన్ యాదవ్‌ను బరిలో దింపింది. నగరంలో యాదవ సామాజిక వర్గానికి మంచి పట్టు ఉంది. మరోవైపు ముస్లిం ఓట్లు అధికంగా ఉండ డంతో ఎంఐఎం సపోర్ట్ తీసుకుంది. ఈ ఎన్నికలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లోనే, కాకుండా బెట్టింగ్ వర్గాల్లోనూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారాయి. ఒక నియోజకవర్గానికి మాత్రమే ఎన్నిక జరుగుతున్నప్పటికీ, అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ వరకు ప్రతి పార్టీ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కాంగ్రెస్ పార్టీకి ఇది రెండేళ్ల పాలనపై ప్రజా తీర్పుగా మారగా, బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యతిరేకతను క్యాష్ చేసుకునే అవకాశంగా మారింది.

### మూడు పార్టీలపై..

మూడు ప్రధాన అంశాలపై పందేలు నడుస్తున్నాయని తెలుస్తోంది. ఎవరు గెలుస్తారు? ఎవరు ఓడతారు? విజేత మెజార్టీ 10 వేలకుపైగా ఉంటుందా? తక్కువగా ఉంటుందా? రెండో స్థానంలో ఎవరు నిలుస్తారు? ఈ అంశాలపైనే ప్రస్తుతం బెట్టింగ్ మార్కెట్ దృష్టి సారించింది. ఎవరు గెలుస్తారు? ఎవరికి రెండో స్థానం వస్తుంది? ఈ ప్రశ్నలతో జూబ్లీహిల్స్ రాజకీయంగానే కాదు, బెట్టింగ్ మార్కెట్‌లోనూ ఉత్కంఠ పీక్‌కి చేరింది.


### ఓటింగ్ శాతం పెరిగేనా..

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సుమారు నాలుగు లక్షల ఓటర్లు ఉన్నారు. అయితే నగరంలో ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనడానికి ఆసక్తి చూపారు. జూబ్లీహిల్స్‌లో కూడా పోలింగ్ ఎక్కువగా జరగదు. 2009లో ఇక్కడ 52.76 శాతం, 2014లో 50.18 శాతం, 2018లో 45.59 శాతం, 2023లో 47.49 శాతం ఓటింగ్ జరిగింది. ఉప ఎన్నికల్లో 50 శాతం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### బెట్టింగ్ రాయుళ్లకు పండుగ..!

రాజకీయ ఉత్కంఠకు తోడు ఈసారి బెట్టింగ్ రాయుళ్లు కూడా రంగంలోకి దిగారు. జూబ్లీహిల్స్ గెలుపోటములపై క్రికెట్ బెట్టింగ్‌ల స్థాయిలో పందేలు కాస్తున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున డబ్బులు పోతున్నాయి. ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, కొండాపూర్, మణికొండ, అలాగే విజయవాడ, గుంటూరు, ప్రకాశం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల నుంచి కూడా బెట్టింగ్‌లో పాల్గొంటున్నట్టు సమాచారం. ఇప్పటికే సుమారు రూ.500 కోట్ల విలువైన పందేలు కాసినట్టు తెలిసిందే. ఎన్నికల ఫలితాలు వెలు వడే సమయానికి ఈ మొత్తం రెట్టింపు అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

## చర్చలు విఫలమైతే యుద్ధమే..: పాక్ రక్షణ మంత్రి




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం పాక్ - అఫ్గాన్ మధ్య శాంతి చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ చర్చలు విఫలమైతే యుద్ధానికి వెళ్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. ఇస్తాంబుల్‌లో అఫ్గాన్ - పాక్ మధ్య శాంతి చర్చలు తిరిగి ప్రారంభమయ్యారు. గురు వారం ఇరు దేశాల మధ్య చర్చలు జరగనున్నాయి. ఈ క్రమంలో పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ తాలిబాన్ ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. శాంతి చర్చలు జరుగుతుండగా.. బెదిరింపులకు పాల్పడడం ఉద్రిక్తతలను పెంచింది.

## మహిళా డీఎస్పీలు ఆదర్శం కావాలి: డీజీపీ



**అక్షరటుడే, హైదరాబాద్:** పోలీస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. ప్రజల హృదయాలు గెలవాలని డీజీపీ శివధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహిళా డీఎస్పీలు రానున్న తరానికి ఆదర్శంగా నిలవాలని ఆయన అన్నారు. గ్రూప్ 1 ద్వారా ఎంపికైన డీఎస్పీలకు హైదరాబాద్ పోలీస్ అకాడమీలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమానికి డీజీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 112 మందికి శిక్షణ ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఇదే అతిపెద్ద బ్యాచ్ అని చెప్పారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ కూడా పాల్గొన్నారు.

## మరో బస్సు ప్రమాదం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** తెలుగు రాష్ట్రాల్లో వరుస బస్సు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా మరో ఘటన చోటుచేసుకుంది. ఆంధ్ర - ఒడిశా సరిహద్దులో పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం రొడ్డవలస సమీపంలో ఒడిశా ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. రన్నింగ్‌లో ఉన్న బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విశాఖపట్నం నుంచి జైపూర్ (ఒడిశా) వెళ్తుండగా.. మంటలు వ్యాపించాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సును నిలిపివేశాడు. వెంటనే ప్రయాణికులను కిందికి దించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న సాలూరు అగ్నిమాపక దళం ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చింది.

## భూ వివాదంలో తుపాకీ కలకలం



**అక్షరటుడే, మెదక్:** భూ వివాదం నేపథ్యంలో తుపాకీతో బెదిరింపులకు పాల్పడేందుకు యత్నించిన ఘటన మెదక్ జిల్లా హవేలి ఘన్‌పూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు ఎల్లంకు, హైదరాబాద్‌కు చెందిన వ్యక్తితో కొంతకాలంగా భూ వివాదం ఉంది. భూ వివాదంపై మెదక్ జిల్లా కోర్టు నుంచి ఎల్లం ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నాడు. ఈ క్రమంలో గురువారం పంట కోయడానికి వెళ్లాడు. అయితే హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి అనుచరులు ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అక్కడ నాగ్‌పూర్ గ్రామానికి చెందిన వ్యక్తి గన్‌తో ఉండడం కలకలం రేపింది. సదరు వ్యక్తిని అనుమానంతో తనిఖీ చేస్తే తుపాకీ లభించింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఘటనా స్థలానికి చేరుకొని గన్ స్వాధీనం చేసుకున్నారు. దానిని పరిశీలించగా.. డమ్మీ గన్ అని తేలింది.



## భారత మహిళా క్రికెట్ జట్టును అభినందించిన ప్రధాని

తొలిసారి వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళా క్రికెట్ టీంను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. జట్టు సభ్యులతో ఆయన బుధవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని ప్లేయర్లతో మాట్లాడారు. కప్ గెలిచిన వారిని అభినందించారు. ప్రపంచ కప్ విజయం తర్వాత మంగళవారం సాయంత్రం న్యూఢిల్లీ చేరుకున్న భారత మహిళా క్రికెట్ జట్టుకు అపూర్వ స్వాగతం లభించిన విషయం తెలిసిందే. -అక్షరటుడే, నేషనల్ డెస్క్

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోలు మృతి చెందారు. బీజాపూర్ జిల్లా మరికెళ్ల అడవుల్లో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. మరికెళ్ల అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారం మేరకు బుధవారం బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఎన్ కౌంటర్ చోటు చేసుకోగా.. ముగ్గురు నక్సల్స్ చనిపోయారు. మిగతా వారి కోసం బలగాలు సెర్చ్ ఆపరేషన్ కొనసాగించాయి. ఈ క్రమంలో గురువారం మరోసారి ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఆపరేషన్‌ను తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసులు పర్యవేక్షించారు.

## సింగర్ చిన్మయికి వేధింపులు..



ప్రముఖ సింగర్ చిన్మయిని సోషల్ మీడియాలో కొందరు ట్రోలింగ్ చేస్తున్నారు. దీంతో ఆమె హైదరాబాద్ సీపీ సజ్జనార్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. అసభ్యకర పదాలతో తనపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన పిల్లలు చనిపోవాలని ట్రోలర్స్ కోరుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చిన్మయి భర్త రాహుల్ ఇటీవల మంగళసూత్రం విషయంలో వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఆమెకు ఇష్టం ఉంటేనే.. తాళి వేసుకుంటుందన్నారు. ఈ క్రమంలో ఆ కామెంట్స్‌పై ఓ యువకుడు ట్రోల్ చేశాడు. కాగా.. కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని సైబర్ క్రైమ్ పోలీసులను సీపీ సజ్జనార్ ఆదేశించారు.

- అక్షరటుడే, సినిమాడెస్క్